క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం శ్రావణ మాసం మఘ నక్షత్రం తదియ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

భక్తులతో కిక్కిరిసిన శింగరకొండ


స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో నిలబడ్డ భక్తులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ దేవస్థానం శనివారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణ మాసం ప్రారంభం, క్షేత్రప్రాధాన్యత గల శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని నేవేద్యాన్ని సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. గొర్రెల కాపరులు గొర్రెల మందలను తీసుకువచ్చి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన బిడ్డ

అద్దంకి: పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటాడని వైద్యాధికారి జయసింహ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. గాజులపాలెంలోని యూపీహెచ్‌లో నిర్వహించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంపై అవగాహన కల్పించి గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. 90 మందికి పౌష్టికాహారం అందజేసిన రోటరీ క్లబ్, దాత చిన మురళీ కృష్ణకు అభినందనలు తెలియజేశారు. బాచిన శివధర పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

లోవోల్టేజ్ సమస్య పరిష్కారం


ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభిస్తున్న మస్తాన్‌రావు

జె.పంగులూరు: మండల కేంద్రంలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారమైనట్లు అద్దంకి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నల్లూరి మస్తాన్‌రావు శనివారం తెలిపారు. కొంత కాలంగా పంగులూరు గ్రామంలో ఓల్టేజీ సమస్యతో ఉండడంతో, సుమారు రూ.20 లక్షల వ్యయంతో 3 ఫేజ్ 100 కేవీ ఏ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ముప్పాళ్ళ దామోదరం, జేఈ ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, జాగర్లమూడి సుబ్బారావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు

చీరాల అర్బన్: చీరాల ఎంఈఓ-1 గా టి.రమాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మసీదు సెంటర్‌లోని ఎంఈఓ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంఈఓ-1గా పనిచేసిన పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు యద్దనపూడి మండలానికి వెళ్ళగా జాండ్రపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న టి.రమాదేవిని ఇన్‌చార్జి ఎంఈఓ-1గా నియమించారు. ఎంఈఓ-2 సుధారాణి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పర్చూరు ఎంఈఓగా శివకోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

పర్చూరు(చినగంజాం): పర్చూరు మండల విద్యాశాఖాధికారి 1 గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న డాక్టర్ అట్లూరి శివకోటేశ్వరరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాచర్ల మండలంలో ఎంఈఓ 1గా విధులు నిర్వహించిన ఆయనను పర్చూరు మండలానికి బదిలీ చేశారు. ఎంఈఓ 2 ఎం వెంకటరామయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభా మూర్తులను స్మరించుకోవాలి


ప్రతిభామూర్తుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

అద్దంకి రూరల్: ప్రతిభామూర్తుల గురించి తెలుసుకుని, స్మరించుకోవాలని సాహితీ వేత్త రాఘవరావు అన్నారు. శనివారం రాత్రి పీసీహెచ్ కోటయ్య ఆధ్వర్యంలో ప్రతిభామూర్తుల మధురస్మృతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన సినీ నటుడు కోట శ్రీనివాసరావు, శరత్‌బాబు, పౌరాణిక నాటక కళాకారుడు నరసింహామూర్తిని స్మరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వసతుల లేమితో ఇక్కట్లు


కేఆర్‌కే వసతి గృహంలో బెడ్‌లు లేకుండా ఉన్న మంచాలు


కిటికీలకు రెక్కలే లేని ఎస్సీ బాలుర వసతి గృహం

- ప్రభుత్వ హాస్టళ్లలో బెడ్లు లేనివైనం
- నేలపైనే నిద్రిస్తున్న చిన్నారులు
- కొన్నిచోట్ల ఇప్పటికీ సొంత భవనాలు లేవు

అద్దంకి: పేద తల్లిదండ్రులు.. తమ బిడ్డలను చదివించాలనే లక్ష్యంతో తమ ప్రేమను చంపుకొని పిల్లలను ప్రభుత్వ హాస్టళ్లకు పంపిస్తుంటారు. అక్కడైనా వారు సుఖంగా ఉంటారనేది వారి నమ్మకం. కానీ తల్లిదండ్రుల నమ్మకాన్ని నేటి ప్రభుత్వం వమ్ము చేస్తోంది. నియోజకవర్గంలో ఉన్న గురుకుల, సాంఘిక సంక్షేమ, కేజీబీవీ, వసతి గృహాల్లో విద్యార్థులు అరకొర వసతులతో కాలం వెళ్లదీస్తున్నారు. వసతి గృహాల్లో సరైన వసతులు లేవంటూ ప్రభుత్వానికి, ఆ శాఖల అధికారులకు హైకోర్టు మొట్టికాయలు వేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాక్షి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని వసతి గృహాల్లో విజిట్ నిర్వహించింది.

బల్లికురవ, సంతమాగులూరులోని ఏల్చూరు గ్రామాల్లో కేజీబీవీలున్నాయి. బల్లికురవ కేజీబీవీలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదవే 270 మంది విద్యార్థులున్నారు. అయితే ఇక్కడ బెడ్లు లేవు. ఏల్చూరు కేజీబీవీలో గదుల కొరత వేధిస్తోంది. పడుకునేందుకు, చదువుకునేందుకు ఒకే గది ఉండటంతో పిల్లలు అసౌకర్యంగా కాలం వెళ్ల దీస్తున్నారు. కేజీబీవీలకు మెయింటెనెన్స్ నిధులు ఇవ్వడం లేదు. ఏవైనా మరమ్మతులు చేయాల్సి వస్తే ప్రిన్సిపాల్స్ సొంత నిధులతో చేయించుకునే దుస్థితి ఉంది. అద్దంకి పట్టణంలో రెండు ఎస్సీ, ఒకటి పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ఒక హాస్టల్ ఉంది. ఇందులోనూ కిటికీలకు డోర్‌లు లేవు, కళాశాల ఇచ్చిన మంచాలున్నా, బెడ్‌లు లేవు. మరుగుదొడ్లు రిపేర్‌లో ఉన్నందున కాలకృత్యాలకు బయటకే వెళ్తున్నారు. ఒక ఎస్సీ బాలుర వసతి గృహానికి సొంత భవనం లేదు. కేఆర్‌కే మినహా మిగిలిన అన్ని వసతి గృహాల్లో టాయిలెట్స్ సరిపడా ఉన్నాయి. జె.పంగులూరు మండలంలోని ముప్పవరంలో రెండు వసతి గృహాలున్నాయి. ఒకటి అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ వసతులు బాగానే ఉన్నా, బెడ్‌లు, మంచాలు లేవు. వసతి గృహాల్లో పిల్లలకు సరిపడా దుప్పట్లు ఇవ్వలేదు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో ఒక వసతి గృహం ఉంది. ఇక్కడ పిల్లలకు ఒకే దుప్పటి ఇచ్చారు. బెడ్లు, మంచాలు లేవు. మొత్తం మీద వసతి గృహాల్లో కొన్ని వసతి గృహాల్లో మినహా మిగిలిన అన్ని వసతి గృహాల్లో అరకొర వసతులతోనే పిల్లలు కాలం వెళ్లదీస్తున్నారు. ఎక్కడా బెడ్, మంచం వసతి లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రభుత్వం వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించి విద్యాభివృద్ధికి తోడ్పడాల్సి ఉంది.

హామీలు నిలబెట్టుకోలేక పోయిన కూటమి


పర్చూరులో కరపత్రాలు అందజేసి కూటమి ప్రభుత్వ హామీలు వివరిస్తున్న నాయకులు


ఇంకొల్లు మండలం భీమవరం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పర్చూరు(చినగంజాం): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేక పోయిందని పర్చూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కఠారి అప్పారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం పర్చూరు మండలంలోని కొత్త పాలెం, రమణాయపాలెం, భూషాయపాలెం, గొల్లపూడి గ్రామాల్లో మండల కన్వీనర్ కఠారి అప్పారావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీలు ఏడాదిన్నర దాటినా హామీలు అమలు కాని విషయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు ముప్పాళ్ళ రాఘవయ్య, పాలేరు వీరయ్య, కోట శ్రీనివాసరావు, లంక శివ, యద్దనపూడి హరిప్రసాద్, కొల్లా శేషగిరి, శ్రీహరి, జెట్టి చంద్రం, కట్ట రత్నారావు, కూరాకుల ఇస్సాక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంకొల్లు మండలంలోని భీమవరం గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలు వాటిని అమలు చేయని తీరు ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలక కరపత్రాలు రూపంలో పంచిపెట్టారు. కార్మిక విభాగం అధ్యక్షుడు తన్నీరు సూరిబాబు, మైనారిటీ సెల్ అయేషా బుడే, లతీఫ్, షంషుద్దీన్, కోటి, శ్రీరాములు, గుంటూరు శ్రీను, కరుణాకర్, తచిట్టిబాబు, గ్రామ నాయకులు రేణుబాబు, చిట్టిబాబు, రెబ్బాస్వామి, ధారా అశోక్, భాస్కరరావు, సురేష్, శ్రీను, విజయరాజు, పెద్ద యోగయ్య,రవి, వంశీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాలి

- సమావేశంలో కౌన్సిలర్లు



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ మించాల సాంబశివరావు

చీరాల అర్బన్: వార్డుల్లో పారిశుద్ధ్యం కుంటుపడిందని, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వార్డుల కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో ఏకరవు పెట్టారు. శనివారం మధ్యాహ్నం చీరాల మున్సిపాలిటీలోని కౌన్సిల్ హాలులో చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా నూతనంగా చైర్మన్, వైస్‌చైర్మన్‌గా మించాల సాంబశివరావు, పొత్తూరి సుబ్బయ్య ఎన్నికైన తర్వాత నిర్వహించిన మొదటి కౌన్సిల్ సమావేశం కావడంతో కౌన్సిలర్లు, అధికారులు వారికి అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన జీరో అవర్‌లో పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొని ఉన్న సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చారు. వార్డుల్లో చెత్త నిల్వలు ఎక్కువగా ఉన్నాయని, పశువుల సంచారం ఎక్కువగా ఉండడంతో పారిశుద్ధ్యం కుంటుపడిందన్నారు. తమ వీధులల్లోకి చెత్త తరలించే ట్రాక్టర్లు కూడా రావడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 33 వార్డుల్లో చెత్త తరలించేందుకు ప్రస్తుతం 7 ట్రాక్టర్లు ఉన్నాయని, అదనంగా రెండు కొత్త ట్రాక్టర్లు వస్తున్నాయని తెలిపారు. రోజుకు మూడు ట్రిప్పులు వేస్తున్నారన్నారు. రామాపురంలోని డంపింగ్ యార్డుకు తరలించేందుకు సమయం పడుతుందన్నారు. నూతనంగా వచ్చిన ట్రాక్టర్లను 22 నుంచి 33 వార్డులకు కేటాయించాలని చైర్మన్ సూచించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బొనిగల జైసన్‌బాబు మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయన్నారు. కౌన్సిలర్ సూరగాని లక్ష్మి మాట్లాడుతూ కుక్కల సమస్య పరిష్కరించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే 285 కుక్కలకు గాను 186 కుక్కలకు వాక్సినేషన్ చేయించామన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బత్తుల అనిల్ మాట్లాడుతూ డ్రైనేజీలో పూడికతీతకు గతంలో రూ.70లక్షలు కేటాయించగా రూ.65లక్షలకు బిల్లులు పెట్టారన్నారు. వీధిలైట్లు వెలగడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఈ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన వీధి లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, టెండర్లు పిలిచామన్నారు. మున్సిపల్ కమిషనర్, డీఈలతో స్వయంగా తానే వార్డులలో పరిస్థితి సమీక్షిస్తానని తెలిపారు. అజెండాలోని 24 వ అంశంలో పట్టణంలో ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యూరో సెట్ ట్యూబులు, కాపర్ బలాస్ట్, స్టార్టర్లు, చౌకులు వంటివి అందించేందుకు ఒక్కరే టెండరు వేశారు. అయితే గతంలో టెండరు పాడిన కాంట్రాక్టరు సక్రమంగా అందించలేదని కౌన్సిలర్లు తెలపగా పునః పరిశీలన నిమిత్తం 24వ అంశాన్ని వాయిదా వేశారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేనేత ఉద్యమ నేత ప్రగడ కోటయ్య


ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

చీరాల: చేనేత ఉద్యమనేత ప్రగడ కోటయ్య చేనేత రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ప్రజాబంధు ప్రగడ కోటయ్య 110వ జయంతి సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. జాతీయ స్థాయిలో చేనేత సమస్యలపై పోరాటం చేయడంతో పాటు చీరాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీరు అందించి రైతు బాంధవునిగా సేవలందించారన్నారు. ఎన్‌జీ రంగా శిష్యునిగా ఉంటూ మద్రాసు టెక్స్‌టైల్ కళాశాలలో శిక్షణ పొంది చేనేత సహకార రంగంలో ఉద్యోగంలో చేరి సహకార రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం పంతులు స్థాపించిన కృషీకార్ లోక్ పార్టీ ద్వారా శాసనసభ్యుడిగా అఖండ విజయం సాధించి.. చీరాల నుంచి శాసనసభ్యునిగా, శాసనమండలి సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, వైస్‌చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు. స్థానిక ప్రగడ కోటయ్య విగ్రహానికి పలువురు నివాళులర్పించారు.

కుందుర్రులో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని కుందుర్రు గ్రామాన్ని శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ బృందం సందర్శించింది. గ్రామంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, గ్రామపంచాయతీ సచివాలయం, ఇతర శాఖలకు సంబంధించిన కార్యాలయాలను సందర్శించారు. డిప్యూటీ ఎంపీడీఓ శివరాం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల్లో గ్రూపు సభ్యులకు అవకాశం

ఇంకొల్లు (చినగంజాం): పీ 4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల మహిళలు తప్పనిసరిగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండాలని డీఆర్‌డీఏ వెలుగు పీడీ కె. శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో పర్చూరు, అద్దంకి, చీరాల నియోజక వర్గాల స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ పీ4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల్లోని మహిళలు స్వయం సహాయక సంఘాల్లో ఉండాలని వారికి మొదటి ప్రాధాన్యతా క్రమంలో జీవనోపాధులు అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు గ్రూపుల్లో లేని వారిని గ్రూపులుగా ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంక్ లింకేజ్ డీపీఎం లక్ష్మణాచారి, ఫైనాన్స్ డీపీఎం రవికుమార్, జీవనోపాధులు డీపీఎం రవిబాబు, హెల్త్ అండ్ న్యూట్రిషన్ డీపీఎం పి. సునీత, అన్ని మండలాల ఏపీఎంలు, సీసీలు, లీగల్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించండి

అద్దంకి రూరల్: ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని ఎంపీడీఓ సింగయ్య క్లాప్ మిత్రాలకు తెలియజేశారు. శనివారం మండలంలోని విప్పర్ల వారిపాలెం గ్రామంలో చెత్త సేకరణ పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. గ్రామంలోని కాలువ కట్టపై చెత్త పేరుకుపోవటాన్ని గమనించి వెంటనే తొలగించాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.

ఆరోగ్య విస్తరణ లక్ష్యం


అడుసుమల్లిలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

పర్చూరు(చినగంజాం): సమాజంలో ఆరోగ్య విస్తరణను బలోపేతం చేయడమే లక్ష్యంగా సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం మండలంలోని అడుసుమల్లి గ్రామంలో సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. డిస్ట్రిక్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వారు శనివారం అడుసుమల్లి గ్రామంలో 104 వైద్య బృందం సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సాధారణ ప్రజలకు, హాని కలిగేందుకు అవకాశం ఉన్న వ్యక్తులు 12 మందికి హెచ్‌ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్‌బీ, సీ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై ముందస్తు గుర్తింపును ప్రోత్సహించడం, ప్రజల్లో అవగాహన పెంచడం అని డాక్టర్ గౌతం అన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ షంషీర్, ల్యాబ్ టెక్నీషియన్ హరీష్, స్థానిక ఎంఎంసీటీవి సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం రమాదేవి, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చేయూత


ఎస్‌ఎల్ కాలనీ పాఠశాలకు మైక్‌సెట్ బహూకరిస్తున్న దాత

బల్లికురవ: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పని చేస్తున్న ప్రభుత్వ పాఠశాల్లో విద్యాభివృద్ధికి ట్రస్ట్ తరపున ప్రతి సంవత్సరం చేయూత నిస్తున్నట్లు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మీ ట్రస్ట్ చైర్మన్ శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. శనివారం ఎస్‌ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాతానగర్ కాలనీ మోడల్ పాఠశాలలో శ్రీరామ చంద్రమూర్తి భార్య శైలజ జన్మదిన వేడుకల సందర్భంగా పాఠశాలకు రూ. 7 వేల విలువైన మైక్ సెట్ బహూకరించారు. పుస్తకాలు, క్రీడా వస్తువులు, మైక్‌సెట్‌లు పరీక్షల సీజన్‌లో వసరమైన సామగ్రి అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి పార్థసారధి, ఉపాధ్యాయులు రాజశేఖరరావు, లావణ్య, పీఎంసీ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


కుంకలమర్రులో డెంగీ మాసోత్సవ ర్యాలీలో రవి బాబు, వైద్య సిబ్బంది

కుంకలమర్రు (కారంచేడు): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందుతారని.. చీరాల సబ్ యూనిట్ ఆఫీసర్ రవిబాబు అన్నారు. శనివారం కుంకలమర్రు గ్రామంలో నిర్వహిస్తున్న డెంగీ మాసోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాడని తొట్లను, పూల కుండీలు, కొబ్బరి బొండాలు, టీ కప్పులను తీసివేసుకోవాలన్నారు. వాటి వలన లార్వా వ్యాప్తి చెందుతుందన్నారు. వీటి వలన దోమలు వృద్ధి చెందుతూ అంటు వ్యాధులకు కారణమవుతుంటాయని పేర్కొన్నారు. అనంతరం ఆయన స్థానిక వైద్య సిబ్బంది, గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. సుజన, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి


పౌష్టికాహార కిట్లు అందిస్తున్న డాక్టర్ సౌమ్య, రోటరీ ప్రతినిధులు

పర్చూరు(చినగంజాం): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. శనివారం దేవరపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 1లో 14 మంది బాలింతలు, గర్భిణులకు పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింత మహిళలకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సుమారు రూ. 1200 విలువ కలిగిన పౌష్టికాహారం కిట్టులను 14 మంది గర్భిణీ, బాలింత మహిళలకు అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు కోమటి ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు, సభ్యులు పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

పంగులూరు హైస్కూల్లో మాదిరి ఎన్నికలు


ఓటింగ్‌లో పాల్గొంటున్న విద్యార్థులు

జె.పంగులూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు విద్యార్థులకు మాదిరి ఎన్నికలు నిర్వహించారు. హెచ్‌ఎం సోమేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవని, విద్యార్థులు ఇప్పటి నుంచే ఎన్నికల విధానాన్ని తెలుసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగానే ఈ మాదిరి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం పాఠశాలకు హాజరైన 260 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. విద్యార్థులు స్లిప్పులు పట్టుకొని వరుసగా క్రమంలో ఓటింగ్ లో పాల్గొన్నారు. నోటా కూడా ప్రవేశపెట్టారు. 10వ తరగతి బాలికల నుంచి నోటా ఓట్లు వచ్చనట్లు ఓట్ల లెక్కింపు తరువాత ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


సర్వీస్ రోడ్డులో ప్రమాదానికి గురైన వాహనాలు

మార్టూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా ఒకరికి తేలికపాటి గాయాలైన సంఘటన స్థానిక జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగింది. 108 సిబ్బంది కోటేశ్వరమ్మ వివరాలు ఇలా ఉన్నాయి. జె.పంగులూరు మండలం భగవాన్ రాజుపాలెం గ్రామానికి చెందిన దేవదాసు తన సమీప బంధువు చిమ్మిరిబండ గ్రామానికి చెందిన డి. కిషోర్ బాబుతో కలిసి బైక్‌పై మార్టూరు నుంచి స్వగ్రామాలకు వెళుతున్నారు. జొన్న తాళి సమీపంలోని సర్వీస్ రోడ్డులో మార్టూరుకు చెందిన ఓ యువకుడు టీవీఎస్ వాహనంపై ఎదురుగా వస్తూ వీరి బైక్ ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ముగ్గురు రోడ్డుపై పడి గాయాల పాలయ్యారు. దేవదాసు, కిషోర్ బాబుల తలకు గాయాలు కాగా వారిని 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీవీఎస్ వాహనదారుకు తేలికపాటి గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి పంపించారు.